సాక్షి అనకాపల్లి

మంగళవారం । 7 । జనవరి । 2025



పరిష్కారం కాని అర్జీలు వెనక్కి!

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలకు పరిష్కారాలు కరువవుతున్నాయి. 8లో



అదానీ హైడ్రో పవర్ వద్దేవద్దు..

చింతలపూడి, నగరంపాలెం ప్రాంతాలలో హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గిరిజనులు ఆందోళన చేశారు. 8లో



వితంతువులపై వివక్ష తగునా!

వితంతువులకు పింఛన్ల మంజూరులో వివక్ష చూపడం తగదని నిరసిస్తూ చీడికాడలో పలువురు ర్యాలీ నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.94 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడచిన 28 రోజులకు గాను కోటీ 94 లక్షల 40 వేల 202 రూపాయలు వచ్చినట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై సోమవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 46.100 గ్రాముల బంగారం, 9.530 కిలోల వెండి లభించిందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి సింహాచలం టికెట్ల విక్రయాలు



భక్తులకు టిక్కెట్లు అందిస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్తరద్వార దర్శన ప్రత్యేక టికెట్ల (రూ.500) విక్రయాలను దేవస్థానం అధికారులు సోమవారం ప్రారంభించారు. సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో టిక్కెట్లను అందుబాటులో ఉంచారు. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్, ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్‌లు పలాస ప్రాంతానికి చెందిన పలువురు భక్తులకు తొలి టిక్కెట్లను విక్రయించారు. 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పీఆర్వో కార్యాలయంలో టిక్కెట్ల విక్రయాలు జరుగుతాయన్నారు. ఆన్‌లైన్‌లో కొనాలనుకునేవారు www.aptemples.ap.gov.inలో టిక్కెట్లు పొందవచ్చని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థి



విద్యార్థి తరుణ్‌ను అభినందిస్తున్న తెనుగుపూడి గురుకుల ఉపాధ్యాయులు

దేవరాపల్లి: జాతీయ స్థాయి అండర్–14 ఖోఖో పోటీలకు మండలంలోని తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయానికి చెందిన 8వ తరగతి విద్యార్థి రొంగలి తరుణ్ ఎంపికయ్యాడు. ఇటీవల రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ పి. రఘు తెలిపారు. మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో ఈ నెల 9 నుంచి 13 వరకు జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 విభాగపు పోటీల్లో పాల్గొంటాడన్నారు. తరుణ్‌ను, వ్యాయామ ఉపాధ్యాయులు జి. తరుణేశ్వరరావు, ఎస్. నాగేశ్వరరావులను ఉమ్మడి జిల్లా గురుకుల విద్యాలయాల ఇన్‌చార్జి సమన్వయ అధికారి జి. గ్రేస్, ప్రిన్సిపాల్ రఘు, ఎస్‌ఎంసీ చైర్మన్ ఇరటా నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



కోట ఉరట్ల మండలంలో గొట్టివాడ గ్రామంలో వరాహనదిలో అక్రమంగా ఇసుకను తవ్వడంతో గుంతలు గుంతలుగా ఏర్పడి **భయంకరంగా మారిన దృశ్యం.**




అక్రమంగా తవ్విన ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్న వైనం

వరాహనదిలో ఇసుక తోడేళ్లు



ఇష్టానుసారం ఇసుక తవ్వేయడంతో నదిలో ఎటు చూసినా ఇటువంటి భారీ గోతులే...

సాక్షి, అనకాపల్లి :

హోంమంత్రి ఇలాకాలో అధికార టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఉచిత ఇసుక పేరుతో ఇసుక దోపిడీకి తెర తీశారు. కూటమి ప్రభుత్వం ఏడు నెలల కాలంలో గొట్టివాడ వరాహనది ఇసుక రీచ్‌లో మట్టి దిబ్బలు కనిపించేలా తవ్వకాలు జరిగాయి. రాత్రీ పగలూ తేడా లేకుండా దర్జాగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. రోజుకు రూ.2 లక్షల చొప్పున వసూళ్లు చేస్తూ ఈ ఏడు నెలల కాలంలో కోట్లాది రూపాయలు వెనకేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ వరాహనదిలో 20 నుంచి 30 అడుగుల మేర గోతులు తవ్వి ఇసుకను తోడేస్తున్నారు. దీంతో నదిలో కనుచూపు మేర ఎటు చూసినా భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. హోంమంత్రి కనుసన్నల్లోనే ఇటీవల సస్పెండ్ చేసిన ఆమె పీఏ జగదీష్, అనుచరుడు గొట్టివాడ టీడీపీ సర్పంచ్ కలిసి ఈ మహా దోపిడీకి పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇంత భారీ స్థాయిలో దోపిడీ జరుగుతుంటే మైనింగ్ అధికారుల జాడ లేకపోవడం శోచనీయం.



గతంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్ చేసిన అధికారులు (ఫైల్)

అధికారులు మధ్యమధ్యలో తూతూ మంత్రంగా దాడులు చేసి చేతులు దులిపేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

గ్రామాభివృద్ధి పేరిట దోపిడీ...

కోటవురట్ల మండలం గొట్టివాడలో గ్రామాభివృద్ధి పేరిట సదరు గ్రామ టీడీపీ నేత వేలం పాటలో ఆ గ్రామానికి రూ.3 లక్షలు పడేసి..అక్రమ మార్గాన రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. వేలం పాట డబ్బులు వారం రోజుల్లోనే ఆ సొమ్ము రాబట్టుకున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. రోజుకు 50 ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా సాగుతోంది. నాటు బళ్ల ద్వారా నదిలోని ఇసుకను తోడేసి.. మామిడి తోటలు, రహదారుల పక్కన, కొండల నడుమ, తమ స్థావరాల్లోను నేరుగా నిల్వ చేసి ట్రాక్టర్లు, లారీల ద్వారా అమ్మకాలకు పాల్పడుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిరాటంకంగా ఇసుకను తరలించేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ద్వారా రోజుకు 10 ట్రిప్పుల్లో రవాణా చేస్తున్నారు. అలా రోజుకు 30 నుంచి 40 ట్రాక్టర్లు 300 నుంచి 400 టన్నుల ఇసుక దోపిడీ జరుగుతుంది. అలా ఏడు నెలల్లో వేలాది టన్నులు ఇసుక మాయం చేశారు. ఒక ట్రిప్‌కు అత్యధికంగా నిర్మాణదారుల నుంచి రూ.2,500 వసూలు చేయాల్సి ఉండగా దూరం బట్టి రూ.10 వేల వరకూ వసూలు చేస్తూ జేబులు నింపుకొంటున్నారని తెలిసింది. యలమంచిలి నుంచి పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది.

చర్యలు 'మామూలే'!

కోటవురట్ల మండలం గొట్టివాడలో వరాహనది నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను దోచుకుపోతున్నా మామూళ్ల మత్తులో అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్య వైఖరితో పాటు ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీని టీడీపీ నాయకులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. మైనింగ్ అధికారులతో పాటు తహసీల్దార్, ఇరిగేషన్, పోలీసులు, అధికారులకు నెలకు ఒక్కో ట్రాక్టర్ నుంచి కనీసం రూ.10 వేల చొప్పున ముడుపులు చెల్లిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



గొటివాడ వద్ద వరాహనదిలో ఏర్పడిన భారీ గొయ్యి

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు...

కూటమి ప్రభుత్వంలో రూ.కోట్ల విలువైన ఇసుకను అక్రమ మార్గంలో తవ్వకాలు చేస్తున్నారు. గొట్టివాడ గ్రామంలో స్థానిక టీడీపీ సర్పంచ్ సుంకర బాబ్జి కనుసన్నుల్లోనే ఇసుక దందా జరుగుతోంది. దీనిపై గతంలో పలుమార్లు స్థానిక వీఆర్‌వో, మండల రెవెన్యూ అధికారులకు కూడా ఫిర్యాదు చేశాం. మైనింగ్ అధికారులు ఏమయ్యారో తెలియడం లేదు. ఎవరికి ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా వచ్చి చూసి వెళ్లిపోవడం తప్ప చర్యలు చేపట్టరు. అక్రమంగా తవ్విన ఇసుకను ట్రాక్టర్లతో కుప్పలు కుప్పలుగా స్టాక్ వేసినప్పుడు మండల రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ తూతూ మంత్రంగా వచ్చి సీజ్ చేశారు. ఆ తరువాత నియోజకవర్గ ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి సీజ్ చేసిన ఇసుకను యథేచ్ఛగా మళ్లీ అక్రమార్కులకు అప్పగించేశారు. గ్రామానికి హాని కలిగిస్తూ ఇక్కడ ఇసుకను అక్రమంగా రవాణా చేసి జేబులు నింపుకొంటున్నారు. దీనిపై గ్రామస్తులమంతా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యాం. త్వరలో దీనిపై ఉద్యమిస్తాం.

–సుంకర గిరి ప్రసాద్, గ్రామస్తుడు

నేటి నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ



ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ

కశింకోట : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సర వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై మంగళవారం నుంచి మూడు రోజులపాటు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ సోమవారం ఇక్కడ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు పాల్గొనాలన్నారు. ఈ నెల 7,8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలో ఉన్న ఎ కన్వెన్షన్ సెంటర్, 10న కర్నూలులోని కమిషనర్ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాలులోను ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష హాజరు ద్వారా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ నియంత్రణ మండలి అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలను మూడు రోజులు వింటుందన్నారు. విద్యుత్ ధరలపై సందేహాలు, సలహాలు, సూచనలను విద్యుత్ వినియోగదారులు ప్రజాభిప్రాయ సేకరణలో ఇవ్వవచ్చునన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనడానికి, రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కశింకోట ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో గాని, అనకాపల్లి విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయ సూపరింటిండెంటింగ్ ఇంజినీర్ వారి కార్యాలయంలో గాని సంప్రదించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రతి రోజూ ముందుగా వినియోగదారుల అభ్యంతరాలు విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో నమోదు చేసుకొని వాటిని వినడం జరుగుతుందన్నారు.

వలంటీర్లపై మంత్రి లోకేష్ వ్యాఖ్యలు సరికాదు



వలంటీర్ల సంఘం రాష్ట్ర నేత దీప్తి

సీతమ్మధార (విశాఖ) : గ్రామ, వార్డు వలంటీర్లు విధుల్లో లేరని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర వలంటీర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ జిల్లా అధ్యక్షురాలు దీప్తి ఖండించారు. ఈ మేరకు ఆమె ఒక వీడియో సందేశాన్ని సోమవారం మీడియాకు విడుదల చేశారు. వలంటీర్లకు రూ.5 వేలు నుంచి రూ10వేలు వేతనాలు పెంచుతామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలిచ్చారని, ఇప్పుడు జీవో లేదని చెప్పడం తమను మోసగించడమేనన్నారు. వలంటీర్లపై మంత్రులు ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటిని పట్టించుకోనవసరం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల ఆందోళనపై మంత్రులు ఫోకస్ చేస్తున్నారని గుర్తు చేశారు. వలంటీర్లంతా ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు.

ప్రధానికి ఘనంగా స్వాగతం పలకాలి

- అధికారులతో మంత్రులు, కలెక్టర్ సమీక్ష



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎంపీ రమేష్

తుమ్మపాల : రాష్ట్ర అభివృద్ధికి నిధులు, ప్రాజెక్టులు అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ప్రజలు పెద్దఎత్తున హాజరై ఘనస్వాగతం పలకాలని, రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేయాలని ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జిల్లాకు సంబంధించిన ఏర్పాట్లను హోం మంత్రి వంగలపూడి అనిత, ఆహార,పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు రూ.90 వేల కోట్లు ప్రాజెక్టులు మంజూరు చేసి, గ్రీన్ ఎనర్జీ, బల్క్ డ్రగ్ పరిశ్రమలకు ఈ నెల 8న ప్రధాని శంకుస్థాపన చేయనున్నారన్నారు. ప్రధాని, ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలకడానికి పూర్తి ఏర్పాట్లు చేయడం జరిగిందని, రాష్ట్రప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలియజేయడానికి ప్రజలు తరలిరావాలన్నారు. ప్రధాని విశాఖ పర్యటన నేపథ్యంలో బహిరంగ సభకు వచ్చే ప్రజలందరు తిరిగి సురక్షితంగా వారి గ్రామానికి చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సభకు ప్రజలను తరలించే ఆర్టీసీ బస్సులు పర్యవేక్షణకు సంబంధించి కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ మండలాల నుంచి వచ్చే వాహనాలు ట్రాఫిక్ నియంత్రణపై ముందస్తు ప్రణాళిక తయారు చేసుకోవాలని, రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలని, విశాఖపట్నం అధికారులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ బాధ్యతలు కేటాయించిన సిబ్బంది ప్రజలను సమీకరించి జాగ్రత్తగా తీసుకురావాలన్నారు. ప్రతి బస్సుపై మండలం, గ్రామం, బాధ్యుని ఫోన్ నెంబరు ఏర్పాటు చేయాలని తెలిపారు. కలెక్టర్ విజయకృష్ణన్ కార్యక్రమ ఏర్పాట్లను వివరించారు. జిల్లా నుంచి 840 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని, 42 వేల మందిని సమీకరించడం జరుగుతుందని, ప్రతి బస్సుకు ఇద్దరు సిబ్బందిని బాధ్యులుగా నియమించడం జరిగిందని, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్ బాబు, కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, లోకం నాగమాధవి, డీఆర్వో వై. సత్యనారాయణరావు, ఆర్డీవోలు షేక్ ఆయిషా, రమణ పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్లు...

12,91,044



తుమ్మపాల : ఓటరు జాబితా ప్రచురణ – 2025 ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్లు 12,91,044 మందితో సోమవారం తుది జాబితా ప్రచురించినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 29 ప్రచురించిన జాబితా ప్రకారం 3,044 మందిని ఓటర్ల జాబితాలో నమోదు చేయగా, 1,870 మంది మరణం, డబుల్ ఎంట్రీ, వలస ఓటర్లుగా గుర్తించి తొలగించడమైందన్నారు. జిల్లాలో పురుషులు మొత్తం 6,27,984 మంది, స్త్రీలు 6,63,032 మంది, థర్డ్ జెండర్ 28 మంది ఉన్నారన్నారు. 18 నుంచి 19 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్లు 17,225 మంది ఉన్నారన్నారు. సర్వీస్ ఓటర్లు ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 3,987 మంది కాగా వారిలో పురుషులు 3,851, స్త్రీలు 136 మంది ఉన్నారు. ఈ మేరకు జాబితాను అన్ని నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కార్యాలయాల్లోను, అన్ని పోలింగ్ బూత్‌లలో ప్రచురించడం జరిగిందని తెలిపారు.

నియోజకవర్గాల వారీగా స్త్రీ, పురుషులు, ఓటర్ల సంఖ్య వివరాలిలా..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
చోడవరం	243	1,05,698	1,12,023	7	2,17,728
మాడుగుల	235	92,028	96,893	2	1,88,923
అనకాపల్లి	251	1,03,140	1,10,728	5	2,13,873
యలమంచిలి	246	1,00,683	1,06,339	8	2,07,030
పాయకరావుపేట	292	1,23,528	1,27,563	2	2,51,093
నర్సీపట్టణం	262	1,02,907	1,09,486	4	2,12,397
మొత్తం	1,529	6,27,984	6,63,032	28	12,91,044

చమ్మచింతలో అధికారులకు చుక్కెదురు

- రెవెన్యూ సదస్సును అడ్డుకున్న గ్రామస్తులు
- తహసీల్దార్ లేకుండా నిర్వహణపై ఆగ్రహం
- తమ భూములు ఆన్‌లైన్‌లో తొలగింపుపై రైతుల నిరసన
- టెంట్లు, కుర్చీలు తొలగించే ప్రయత్నం



సదస్సు వద్ద రైతులతో కలిసి ఆందోళన చేస్తున్న సర్పంచ్ కొండబాబు, ఉప సర్పంచ్ దివాణం



గ్రామసభలో ఖాళీగా కూర్చున్న డిప్యూటీ తహసీల్దార్ శివ, సిబ్బంది

నాతవరం : తహసీల్దార్ లేకుండా భూ సమస్యలు పరిష్కరించకుండా మొక్కుబడిగా నిర్వహించే రెవెన్యూ సదస్సు ఎందుకని రైతులు అడ్డగించారు. మండలంలో చమ్మచింత గ్రామంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ లేకుండా రెవెన్యూ సదస్సు దిగువ స్థాయి అధికారులతో మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. ఈ గ్రామంలో 1/70 యాక్టు పరిధిలో ఉంది, ఇక్కడ 95 శాతం ఓసీ, బీసీ ఎస్సీ కులస్తులు పూర్వం నుంచి జీవనం సాగిస్తున్నారు. 1978 వరకు ఇక్కడ భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు జరిగేవి. 2018 వరకు తాత తల్లిదండ్రులు భూములు తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద రెవెన్యూ అధికారులు మార్పు చేసేవారు. తర్వాత నుంచి అధికారులు ఇక్కడ భూములు పట్టాదారులు పాసుపుస్తకాలు ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్ వంటి పనులు చేయకుండా నిలుపుదల చేశారు. పూర్వీకుల నుంచి సాగు చేసే రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నా ఆన్‌లైన్ నమోదు కాక ఆధార్ కార్డు నెంబర్లు లింక్ కాకపోవడం వన్‌బీ అడంగళ్ ఆన్‌లైన్ కాపీలు రావడం లేదు. ఈ సమస్యలన్నీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు చెప్పుకునేందుకు రైతులు ఎంతో ఆశతో ఉన్నారు. సదస్సుకు తహసీల్దార్ రాకపోవడంతో రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులంతా ఏకమై ఆందోళనకు దిగారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, మాజీ ఎంపీటీసీ సభ్యులు కాశపు నూకరాజు, నీటి సంఘం డైరెక్టరు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు రైతులతో కలిసి రెవెన్యూ సదస్సు వద్ద ఆందోళన చేశారు. కనీస సమస్యలు పరిష్కరించని సదస్సు ఎందుకని నినాదాలు చేశారు. సదస్సు వద్ద టెంట్లు, కుర్చీలు తొలగించే ప్రయత్నం చేశారు. రెవెన్యూ సిబ్బంది ఇక్కడ్నుంచి వెళ్లిపోండి భూ సమస్యలు పరిష్కరిస్తేనే సదస్సు పెట్టాలని డిమాండ్ చేశారు.

తాము ఏళ్ల తరబడి బాధలు పడుతున్నామని, ప్రస్తుత ప్రభుత్వం గతంలో జరిగే భూ రీసర్వే సైతం నిలుపుదల చేసిందన్నారు. అనంతరం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ మాట్లాడుతూ తహసీల్దార్ ఆదేశాల ప్రకారమే నేను రెవెన్యూ సదస్సు నిర్వహించేందుకు వచ్చానన్నారు. మీ భూ సమస్యలు ఉంటే సభలో దరఖాస్తు చేస్తే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తాన్నారు. ఈ గ్రామంలో 1/70 యాక్టు పరిధిలో ఉందని గిరిజనులకు తప్ప ఇతరులకు తాము ఏమీ చేయలేమని, కుల ధ్రువీకరణ, మరణ సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు ప్రసాద్, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక



లక్ష్మీపురంలో ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయ సిబ్బంది



కుసుర్లపూడిలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

చోడవరం రూరల్/రోలుగుంట: రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు చోడవరం మండలం లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ముర్రు రమేష్ రూపొందించిన యాంటీ సూసైడల్ ఫ్యాన్ ప్రాజెక్టు, రోలుగుంట మండలం కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు ఆర్. అవినాస్, ఎ.భార్గవ్ తయారు చేసిన ఫైర్ అలారం ఎంపికయ్యాయి. ఇటీవల కశింకోటలో జిల్లా స్థాయి సైన్సు ఫెయిర్‌లో వీరు సత్తా చాటారు. విజయవాడలో ఈ నెల 7, 8 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకోవాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎ.వి.జగన్నాథరావు, శెట్టి మోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

1,200 లీటర్ల బెల్లం పులుపు స్వాధీనం

• 20 లీటర్ల సారా పట్టివేత



కె.కోటపాడు: మండలంలో గవరపాలెం, కొరువాడ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై చోడవరం ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు చేశారు. కొరువాడ జీవీఎంసీ కెనాల్ మార్గం సమీపంలో 20 లీటర్ల సారా పట్టుకున్నారు. ఈ ప్రాంతంలో 800 లీటర్ల బెల్లం పులుపు, గవరపాలెం కొండ దిగువ ప్రాంతంలో 400 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో చోడవరం, కొత్తవలస ఎక్సైజ్ పోలీసులు, అనకాపల్లి, విజయనగరం జిల్లాల ఈఎస్‌టీఎస్ సిబ్బంది పాల్గొన్నారని ఎస్ఐ శేఖరం తెలిపారు.

బ్లైండ్ ఫుట్‌బాల్‌లో ఏపీ విజయం



విజయం సాధించిన ఏపీ జట్టు

విశాఖ స్పోర్ట్స్: తొలిసారిగా నిర్వహించిన బ్లైండ్ ఫుట్‌బాట్ పోటీలో ఏపీ జట్టు విజయం సాధించింది. ఒడిశాతో సోమవారం ఈ పోటీ నేత్ర విద్యాలయ గ్రౌండ్‌లో జరిగింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు చెరో గోల్ చేసి సమవుజ్జీగా నిలిచాయి. విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన పెనాల్టీ షూటౌట్‌లో ఏపీ జట్టు విజయకేతనం ఎగురవేసింది. జట్టు కెప్టెన్‌గా సూర్య రోహిత్, కోచ్‌గా సృజన్ వ్యవహరించారు. అతిథులు సోమేష్, శిరీషా, ఉదయ్‌కుమార్ ఏపీ జట్టును పరిచయం చేసుకున్నారు.

నేడు, రేపు డ్రోన్ల వినియోగంపై నిషేధం

విశాఖ సిటీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా ఈ నెల 7, 8 తేదీల్లో ఆయా ప్రాంతాల్లో డ్రోన్లు వినియోగాన్ని నిషేధించారు. ఈ మేరకు నగర పోలీసులు డ్రోన్ కెమెరాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. మంగళ, బుధవారాల్లో ప్రధాని సభ జరిగే ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం వద్దే కాకుండా ఆయన పర్యటించే పరిసర ప్రాంతాలకు 5 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్ కెమెరాలను ఎటువంటి పరిస్థితుల్లో కూడా వినియోగించరాదని స్పష్టం చేశారు. వినియోగిస్తే వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిష్కారం కాని అర్జీలు వెనక్కి!

• పదే పదే అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
• నిరసనలు తెలుపుతున్న అర్జీదారులు



భూ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు



పింఛను మంజూరుకు దరఖాస్తు చేసుకున్న యాదగిరి సత్యవతి, వేపాద నూకరత్నం



భూ సమస్య పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న చెన్న సత్యవతి తదితరులు

తుమ్మపాల : కూటమి ప్రభుత్వం అధికాంలోకి వచ్చినప్పటి నుంచి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలకు పరిష్కారాలు కరువవుతున్నాయి. మండల స్థాయిలో పరిష్కారం లేకనే కలెక్టర్‌కు తమ సపమస్యలను తెలియజేసేందుకు వస్తే ఇక్కడా అదే పరిస్థితి ఉత్పన్నమవుతుందని పలువురు అర్జీదారులు వాపోతున్నారు. పదే పదే ఫిర్యాదులు చేసినా చర్యలు ఉండకపోవడంతో పలువురు కలెక్టరేట్ ఎదుట సోమవారం తమ ఆవేదనను నిరసనల రూపంలో తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి కూటమి నాయకులు, క్షేత్ర స్థాయి అధికారులే అడ్డం కావడంతో సమస్యలకు పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో కూడా అధికారులు చొరవ చూపడం లేదంటున్నారు. భూ సమస్యలు, గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు నిలిపివేయడం, ప్రభుత్వ పథకాల్లో అర్హులకు లబ్ధి చేయకపోవడం వంటివే అధికంగా ఉన్నాయి.

వెల్‌నెస్ కేంద్రం బిల్లు ఇవ్వడం లేదు

సబ్బవరం మండలం మొగలిపురం గ్రామంలో సచివాలయ భవనాల్లో భాగంగా ప్రజలకు వైద్య సేవలందించే వెల్‌నెస్ కేంద్రం నిర్మించగా గత ఏడాది నవంబర్ 20న ప్రభుత్వం పంచాయతీ ఖాతాలో జమ చేసిన రూ.7,50,314 బిల్లును విడుదల చేయడంలో సర్పంచ్, కార్యదర్శి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని గ్రామానికి చెందిన యడ్ల నాయుడు కలెక్టర్‌ను అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన వెల్‌నెస్ కేంద్రాన్ని తాను సొంత నగదుతో పూర్తిచేయగా చివరి బిల్లు గ్రామపంచాయతీ ఖాతాలో విడుదలై 45 రోజులు పూర్తయినప్పటికీ తనకు బిల్లు ఇవ్వడం లేదని ప్రతి రోజు పంచాయతీ కార్యాలయానికి వెళ్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేసామని, స్పందన లేకపోవడంతో కలెక్టర్‌కు వినతి అందించామని తెలిపారు.

ప్రభుత్వ భూములు కాపాడండి

జిరాయితీ భూములు అనుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన అనధికార లేఅవుట్‌లో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని అనధికార భవనాల నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతూ అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామానికి చెందిన యర్రా అప్పలనాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనధికార ప్రైవేటు లేఅవుట్‌లో సర్వే నంబర్ 390 గెడ్డ, 395, 396 ప్రభుత్వ భూములకు సర్వే చేపట్టి కాపాడాలని కోరారు.

దౌర్జన్యం చేస్తున్నారు..ఆదుకోండి...

అన్ని హక్కులు, రెవెన్యూ రికార్డులతో అనుభవిస్తున్న భూమిలోకి కొందరు వ్యక్తులు చొరబడి తనపై దాడి చేసి భూ అక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, వారి నుంచి తనకు, తన భూమికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్.రాయవరం మండలం చిన్నగుమ్ములూరు గ్రామానికి చెందిన చెన్నా సత్యవతి కలెక్టరేట్ గేటు వద్ద నిరసన చేసింది. సర్వే నెం.287-7, 98-6, 289-2, 286-10 మొత్తం 1.78 ఎకరాల భూమి ఉంది. తన భర్త వాయునందనరావు మరణించగా ఒంటరిగా జీవిస్తున్న తనపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించిన గ్రామస్తులతో పాటు రామయ్యపటం వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ వారి ఆగడాలకు బలవుతున్నానని, వృద్ధాప్యంలో ఉన్న తనకు పోలీస్, రెవెన్యూ అధికారులే దిక్కు అని తన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని ఆమె కోరింది.

వితంతు పింఛను కోసం వస్తే పొమ్మంటున్నారు

వృద్ధాప్యంలో ఉన్న తన భర్త మరణించి ఐదు నెలలు పూర్తయినా వితంతు పింఛను మంజూరు కాలేదని కలెక్టరేట్‌లో అర్జీ చేసుకునేందుకు వస్తే తిరిగి వెనక్కు పంపించేస్తున్నారని అనకాపల్లి మండలం కూండ్రం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన యాదగిరి సత్యవతి, వేపాద నూకరత్నం కొన్ని నెలల క్రితం వారి భర్తలు మరణించడంతో వితంతువులుగా ఉన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛను ఏడాది కాలంగా మంజూరు కాకపోవడంతో కలెక్టర్‌కే తమ సమస్య తెలియజేసేందుకు అర్జీలతో వచ్చారు. వారి అర్జీలను పరిశీలించిన సిబ్బంది ప్రభుత్వం ఈ పథకాన్ని ఇంకా మంజూరు చేయలేదని, అర్జీ చేసినా ప్రయోజనం లేదంటూ వెనక్కు పంపించేశారు. దీంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేసి వెనుదిరగడంతో పీజీఆర్ఎస్ అధికారి పిలిచి వారి అర్జీలను నమోదు చేయించారు.

ఆరు నెలలుగా తిరుగుతున్నా...

అనకాపల్లి మండలం రేబాక సర్వే నెం.69-2లో తమ పూర్వీకుల నుంచి వచ్చిన కాకర సెలక 27 ఎకరాల భూమిని టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ ఆక్రమించి ఫోర్జరీ రికార్డులు సృష్టించి విక్రయించేశారని కాపుశెట్టివానిపాలెం గ్రామానికి చెందిన పాలిక చిట్టెమ్మ, వెల్లంకి వరలక్ష్మి, లావేటి లక్ష్మి, ఎర్రా ఈశ్వరమ్మ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. వారసత్వంగా వచ్చిన భూమిని తమకు తెలియకుండా ఇతరులతో ఫోర్జరీ పత్రాలు సృష్టించి విక్రయించేశారని, అధికారులు విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. గత ఆరునెలలుగా ఫిర్యాదులు చేస్తున్నా తమకు న్యాయం జరగడం లేదని వాపోయారు.

తుమ్మపాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల వ్యక్తిగత, సామాజిక అంశాలపై 211 అర్జీలను కలెక్టర్ విజయ కృష్ణన్, డీఆర్వో వై.సత్యనారాయణరావు, గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీల సమస్యల గూర్చి సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. మొత్తం అర్జీల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యలపై 145, పంచాయతీరాజ్ 16, పోలీసుశాఖ 6, సర్వేశాఖ 6, మున్సిపల్ 4, సివిల్ సప్లయి 4, ఇతర శాఖలకు 30 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 30 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) 30 అర్జీలు వచ్చాయని అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ తెలిపారు. అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఎస్ఐ డి.వెంకన్న పాల్గొన్నారు.

దేవానంద స్వామీజీ ఆరాధన మహోత్సవం నేడు

• కొత్తపెంట రానున్న స్వామిజీ శిష్యులు, భక్తులు



ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న స్వామీజీలు, సాధు సత్‌పురుష్‌లు

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంటలో సద్గురు దేవానంద సరస్వతీ స్వామీజీ మహరాజ్(రుషీకేష్) 25వ ఆరాధన మహోత్సవాలను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవానంద స్వామీ ఆధ్యాత్మిక జీవన సంఘం ఆధ్వర్యంలో స్వామీజీ ఆశ్రమాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దేశ నలుమూలల నుంచి స్వామీజీ భక్తులు, శిష్యులు, సాధు సత్‌పురుష్‌లు, పీఠాధిపతులు హాజరు కానున్నారని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ టి.మల్లేశ్వరరావు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆరాధన మహోత్సవాలలో భాగంగా రెండో రోజు సోమవారం వివిధ ప్రాంతాల నుంచి హాజరైన రామకృష్ణానంద, పాశర్లపాటి బంగారయ్య శర్మ, బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, శ్రీను సిద్దాంతి, విష్ణుదేవానంద స్వామీ, శ్రీవాసు దేవానంద స్వామీ తదితర పీఠాధిపతులు, స్వామీజీలు, సాధు సత్‌పురుష్‌లు పాల్గొని దేవానంద స్వామీజీని దర్శించుకున్నారు. అనంతరం స్వామీజీలు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలతో భక్తజనం పులకించిపోయారు. సర్పంచ్ రొంగలి వెంకటరావు, రెడ్డి పైడంనాయుడు, గోపి, ముత్యాలరావు, కర్రి దేముడు, రొంగలి శంకరరావు తదితర ఆశ్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మూడు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయి నిందితులతో పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ ఈశ్వరరావు

అనకాపల్లి : మండలంలో ఏలేరు కాలువ వద్ద స్కూటీపై ముగ్గురు వ్యక్తులు 3 కిలోల గంజాయితో పట్టుబడినట్టు సీఐ టి.వి.విజయకుమార్ సోమవారం చెప్పారు. సీఐ కథనం మేరకు అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఏలేరు కాలువ వద్ద స్కూటీని చెక్ చేయగా పట్టణంలో విజయరామరాజుపేట, ఎస్సీ కాలనీకి చెందిన కొల్లిబంటి శివ, మండలంలో సుబ్రమణ్యం కాలనీకి చెందిన పుడిమి దుర్గాప్రసాద్, గోరంట్ల ప్రసాద్‌కుమార్ వేరే వ్యక్తుల వద్ద 3 కిలోల గంజాయిని రూ.15వేలుకు కొనుగోలు చేసి తీసుకుని వచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి అమ్మకానికి సిద్ధపడుతున్నట్టు సీఐ చెప్పారు. నిందితుల నుంచి ఒక సెల్‌ఫోన్, స్కూటీ, రూ.400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఈశ్వరరావు పాల్గొన్నారు.

వితంతువులపై వివక్ష తగునా!



ఎంపీడీవోకు వినతిపత్రాలు అందిస్తున్న మహిళలు

చీడికాడ : కుటుంబాన్ని పోషించే భర్తను కోల్పోయి అల్లాడుతున్న వితంతువులను ప్రభుత్వం పెద్దమనసుతో ఆదుకోవాల్సింది పోయి వారిపై వివక్ష చూపడం తగదని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. సోమవారం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు ఆధ్వర్యంలో మండలంలోని 23 పంచాయతీలకు చెందిన పింఛన్లు మంజూరు కాని వితంతువులు చీడికాడలో ఎంపీపీ కురచా జయమ్మతో కలసి మెయిన్‌రోడ్డు నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ఎటువంటి వివక్ష లేకుండా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడంతో పాటు సంక్షేమ పథకాల అమలులో వివక్ష చూపుతున్నారని విమర్శించారు. పింఛను మంజూరు కాని150 మంది వితంతువులతో కలిసి ప్రజాపిర్యాదుల వేదికలో భాగంగా ఎంపీడీవో హేమసుందరరావుకు అర్జీలందించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనువాసరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, నేతలు కురచా నారాయణమూర్తి, చుక్కా అప్పలనాయుడు, రమణబాబు, ముత్యాలనాయుడు, నర్సింహమూర్తి, మహేష్, అప్పారావు, సలాది గంగేశు, షేకు సూర్యనారాయణ, ఈర్లె చైతన్య తదితరులున్నారు.

దాడికి పాల్పడిన టీడీపీ వర్గీయులపై చర్యలు తీసుకోవాలి

• అనకాపల్లి ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

పరవాడ: తమపై అన్యాయంగా దాడికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వెన్నలపాలెం గ్రామానికి చెందిన పైల మణి, ఆమె భర్త రేగారావు అనకాపల్లి ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. వెన్నలపాలెంలోని ఇంటి వద్ద ఈ నెల 2న పనిచేస్తున్న తన భర్త రేగారావుపై టీడీపీ వర్గానికి చెందిన పైల వెంకటరమణమూర్తి, పైల ప్రసాద్, బోజంకి అప్పలనాయుడు కర్రలతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారని భార్య మణి ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్తను కాపాడుకొనే క్రమంలో తనపై కూడా దాడికి పాల్పడ్డారని తెలిపారు.

దీనిపై పరవాడ పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేసినా, ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన టీడీపీ వ్యక్తులపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని బాధితురాలు మణి ఎస్పీకి అందించిన ఫిర్యాదులో కోరారు.

అదానీ హైడ్రో పవర్ వద్దేవద్దు..

• సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనుల వినూత్న నిరసన
• అడ్డాకుల టోపీ ధరించి, విల్లు చేతపట్టి ఆందోళన
• ప్రధాని మోదీ, అదానీ చిత్రపటాలు దగ్ధం



నగరపాలెంలో నిరసన చేస్తున్న గిరిజనులు, సీపీఎం నాయకులు

దేవరాపల్లి: చింతలపూడి, నగరంపాలెం ప్రాంతాలలో హైడ్రో పవర్ ప్లాంట్‌ను నిర్మించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర డిమాండ్ చేశారు. చింతలపూడి పంచాయితీ నగరంపాలెంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మించబోయే స్థలంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు అడ్డాకుల టోపీ ధరించి, విల్లు చేతపట్టి వినూత్న నిరసన తెలిపారు. ప్రధాని మోదీ, అదానీ చిత్రపటాలను దహనం చేశారు. గిరిజనుల బతుకులను నాశనం చేసే ఈ ప్రాజెక్టును నిర్మించవద్దని నినాదాలు చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ నగరంపాలెం గ్రామంలో అటవీ ప్రాంతం ఉందని జల్‌జీవన్ మిషన్ పనులను అడ్డగించిన ఫారెస్టు అధికారులు, దట్టమైన అటవీ ప్రాంతాన్ని అదానీకి ఎలా కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రైవాడ, కోనాం ప్రాజెక్టులకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 8న విశాఖలో పర్యటించనున్న ప్రధాని మోదీ హైడ్రో పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుకు కేంద్రం రహస్యంగా అనుమతులిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. నిరసనలో తామర్ల కొండబాబు, రాజు, మహేష్, సూకురి రామకృష్ణ, తామర్ల అచ్చిబాబు, మామిడి రవికుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

• పని ఒత్తిడే కారణం!
• మార్చిలో పదవీ విరమణ చేయనున్న వీఆర్వో



వీఆర్వో సూర్య నారాయణమూర్తి (ఫైల్)

నాతవరం : పని ఒత్తిడి కారణంగా వీఆర్వో గుండెపోటుతో సోమవారం సాయంత్రం మరణించాడు. మండలంలో వల్సంపేట వీఆర్వోగా రాయవరపు వెంకట సత్య సూర్యనారాయణమూర్తి (బాబ్జి) పని చేస్తున్నారు. ఎప్పటి మాదిరిగానే సోమవారం ఉదయం వల్సంపేట గ్రామానికి వెళ్లి పీజీఆర్ఎస్‌కు సంబంధించి ఫిర్యాదులపై రైతులతో మాట్లాడారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అప్పటికే కలెక్టర్ కార్యాలయం నుంచి పీజీఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సమాచారం వచ్చింది. మండల వ్యాప్తంగా చూస్తే వల్సంపేట రెవెన్యూ గ్రామ పరిధిలోనే అధికంగా ఉండడంతో వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్ వేణుగోపాల్ సూచించారు. 2015లో అప్పటి ప్రభుత్వం సిట్ అధికారులు వల్సంపేట రెవెన్యూ పరిధిలో 90 మంది రైతుల జిరాయితీ భూములు 22ఏలో పెట్టేశారు. అప్పట్నుంచి రైతులు కలెక్టర్ కార్యాలయంలో జరిగే పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేస్తున్నారు. ఈనెల 3వ తేదీన వల్సంపేటలో జరిగిన రెవెన్యూ సదుస్సులో అయా రైతులంతా దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో వీఆర్వోలకు పని ఒత్తిడి దారుణంగా పెరిగింది. సోమవారం ఉదయం ఇంటి నుంచి డ్యూటీకి బాగానే వెళ్లాడని సాయంత్రం ఇంటి రాగానే నీరసంగా ఉందంటూ భార్య సరోజనికి చెప్పాడు, వెంటనే ఇంటి వద్దే కుప్పకూలిపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడని కుటుంబీకులు తెలిపారు. వీఆర్వో మార్చిలో పదవీ విరమణ చేస్తారని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. అంత్యక్రియల కోసం రూ.25 వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ముందుగా సోమవారం రాత్రి రూ.10వేలు ఇచ్చానని, మిగతావి కటుంబ సభ్యులకు అందిస్తామన్నారు. మృతుడికి భార్య సరోజిని, కుమార్తె, కుమారుడు ఉన్నాడన్నారు. వీఆర్వో స్వగ్రామం రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామం. ఆయన మృతికి వీఆర్వోల సంఘం జిల్లా నాయకుడు బాబు, మండల వీఆర్వోలు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

ఓవరాల్ చాంప్ సింహాచలం బీసీ గురుకుల పాఠశాల

ముగిసిన బీసీ గురుకులాల జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్



ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్న సింహాచలం గురుకుల పాఠశాల విద్యార్థులు

సింహాచలం: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని విద్యా శాఖ ఆర్‌జేడీ బి.విజయ్ భాస్కర్ తెలిపారు. సింహాచలం మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరిగిన జోనల్ స్థాయి (జోన్-1) స్పోర్ట్స్ మీట్ సోమవారంతో ముగిసింది. రెండో రోజు జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్ భాస్కర్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని సూచించారు. రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. సింహాచలం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలోని 15 బీసీ గురుకుల పాఠశాలల నుంచి 350 మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సింహాచలం గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ భానుమతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విజేతలు వీరే..

ఓవరాల్ చాంపియన్ షిప్ విభాగంలో సింహాచలం బీసీ గురుకుల పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, శ్రీకాకుళం జిల్లా అంపోలు గురుకుల పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. వ్యక్తిగత చాంపియన్ షిప్ విభాగంలో అనకాపల్లి బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి కె.కుమార్ ప్రథమ స్థానం, సింహాచలం గురుకుల పాఠశాల విద్యార్థి ఎ.హరీష్ ద్వితీయ స్థానంలో నిలిచారు.

చౌడువాడలో పశువుల పాక దగ్ధం

• కాలిపోయిన ఆవు, మరో ఆవుకు తీవ్రంగా గాయాలు
• గుర్తు తెలియని వ్యక్తులు పాకకు నిప్పు పెట్టారని అనుమానం



కాలిన గాయాలతో బయట పడ్డ ఆవు



పశువుల పాకలోనే మంటల్లో చిక్కి చనిపోయిన ఆవు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో హైస్కూల్‌కు సమీపంలో గల తలారి వెంకటలక్ష్మికి చెందిన పశువుల పాక ఆదివారం అర్ధరాత్రి కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు పశువుల పాకకు నిప్పు పెట్టి ఉండవచ్చునని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో పశువుల పాక నుంచి అగ్నికీలలు రావడంతో స్థానికులు ఆర్పేందుకు యత్నించారు. ఒక్కసారిగా పశువుల పాక నలుమూలల నుంచి మంటలు అలముకోవడంతో మంటలను అదుపు చేయడం ఎవరితరమూ కాలేదు. దీంతో పశువుల పాకలో ఉన్న రెండు ఆవులలో ఒక ఆవు మంటల్లోనే కాలి చనిపోయింది. మరో ఆవు పాకలో నుండి కాలిన గాయాలతో బయట పడింది. వెంకటలక్ష్మికి పశువుల పాక కాలుతున్న సమాచారం ఇచ్చేందుకు స్థానికులు రామాలయం వద్ద గల ఆమె ఇంటికి వెళ్లగా ఇంటి నుంచి ఆమె బయటకు రాకుండా ఇంటికి ఒక వైపు కప్పు, మరో వైపు జీఏ వైరుతో కట్టేశారు. ఆమె ఇంటిలో నుంచి వచ్చేందుకు వీలు లేకపోవడంతో కప్పు, జీఏ వైరును తొలగించి ఆమెను బయటకు స్థానికులు తీసుకువచ్చారు. ఇంటిలో తలారి వెంకటలక్ష్మిని బంధించి కావాలనే ఆమెకు నష్టం చేసేందుకు పశువుల పాకకు నిప్పు పెట్టి ఉండవచ్చునని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అగ్నిప్రమాదంలో పాకతో పాటు సుమారు రూ.లక్షా 50 వేలు విలువైన పశువులకు నష్టం కలిగినట్టు బాధితులు ఆవేదన వ్యక్తం చేసింది.

10న చేతివృత్తుల రిజిస్ట్రేషన్ మేళా

నర్సీపట్నం: చేతివృత్తుల వారికి మెప్మా ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. స్థానిక మెప్మా కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన రిజిస్ట్రేషన్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే తమ సిబ్బంది 180 మంది చేతివృత్తిదారులను సేకరించారన్నారు. ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, ఏసీ, ఫ్రిడ్జ్, గీజర్లు, టీవీ, వాషింగ్ మెషిన్ల మరమ్మతులతో పాటు బ్యూటీషియన్ వృత్తుల్లో ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వివరాలు మెప్మా అధికారులకు అందించాలన్నారు. వారి వివరాలను హోమ్ ట్రయాంగిల్ యాప్‌లో పొందుపరుస్తామన్నారు. వారి సేవలను ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడు బాబూ?

- సామాజిక పింఛన్ల కోసం పలువురు ఎదురుచూపులు
- అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- మరోవైపు విచారణ పేరిట లబ్ధిదారుల కోతకు కుట్ర
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులైన దరఖాస్తుదారులు
- వైఎస్ జగన్ హయాంలో నిరంతర ప్రక్రియగా రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరు



మండలంలో కొత్తూరు సచివాలయం



అనకాపల్లి: కొత్త పింఛన్ల మంజూరుకు కూటమి ప్రభుత్వం ముఖం చాటేస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా కనీసం దరఖాస్తుల స్వీకరణ కూడా చేపట్టలేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారం చేపట్టిన నెల రోజుల్లో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కూటమి నాయకులు ఊదరగొట్టారు. తీరా గెలిచాక సీఎం చంద్రబాబు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి మొండి చేయి చూపారు. మరోవైపు విచారణ పేరుతో ప్రస్తుతం తీసుకుంటున్న పింఛన్ లబ్ధిదారుల్లో కోతకు కుట్ర పన్నడంతో బడుగులు ఆందోళన చెందుతున్నారు. పట్టణ, మండలంలో కొత్త పింఛన్ల కోసం ఆయా సచివాలయాల చుట్టూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తిరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని ఉద్యోగులు చెప్పడంతో దరఖాస్తుదారులు తెల్లముఖం వేసుకుని వెనుదిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. వైఎస్సార్‌సీపీ పాలనలో పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగేదని, కూటమి పాలనలో అటువంటి పరిస్థితి లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో సులభతరం

వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నింటికీ వలంటీర్ వ్యవస్థ అందుబాటులో ఉండేది. వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి అర్హులను గుర్తించి వారే దరఖాస్తు చేసి పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేసేవారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు కోసం ఎదురుచూపులే మిగులుతున్నాయి.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్

గత ఏడాది ఏప్రిల్ 18 నుంచి ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్‌ను చంద్రబాబు ప్రభుత్వం ఏడు మాసాలు అవుతున్నప్పటికీ ఓపెన్ చేయలేదు. గత ఏడాది జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడింది. పింఛన్లు తీసుకునేందుకు 60 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు, వితంతవులతో పాటు కొత్తగా వివాహాలు చేసుకున్న వారు కొత్త రేషన్ కార్డుల కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో 9,865, మండల పరిధిలో 10,712 మంది ప్రస్తుతం పింఛన్లు తీసుకుంటున్నారు.

నిరంతర ప్రక్రియ కావాలి



పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం చేపట్టాలి. సుమారుగా ఏడు మాసాలు అవుతున్నప్పటికీ ఒక కొత్త పింఛన్ ఇవ్వలేదు. ఉన్న పింఛన్లు తీసేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకోవడం అన్యాయం. వృద్ధులను ప్రభుత్వమే ఆదుకోవాలి. – గంటా శ్రీరామ్, సీపీఎం మండల కన్వీనర్, అనకాపల్లి

గత ఏడాది వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేశా..

గత ఏడాది వితంతు పింఛన్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాను. ఏప్రిల్ మాసంలో ఎన్నికల కోడ్ రావడంతో కొత్త వితంతు పింఛన్ ఇవ్వకుండా నిలుపుదల చేశారు. ప్రస్తుతం ఎప్పుడు కొత్త పింఛన్లు ఇస్తారో అర్థం కావడంలేదు. మాలాంటి వారిపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం అన్యాయం. – ఎ.వరలక్ష్మి, వితంతువు, అనకాపల్లి

క్లుప్తంగా

తాగునీరు సరఫరా చేయాలి



ఎంపీడీవో నరసింహారావుకు వినతిపత్రం అందిస్తున్న కోన లక్ష్మణ్, మాణిక్యాలరావు

అనకాపల్లి: మండలంలో సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామానికి 15 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనర్ కోన లక్ష్మణ అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కె.వి. నరసింహారావుకు సోమవారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి కుళాయి నిర్మాణం పేరుతో ఉన్న కొద్దిపాటి తాగునీటి సదుపాయాన్ని కూడా ప్రజలకు దూరం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. తక్షణం తాగునీరు సరఫరా చేయాలన్నారు. కమిటీ కో-కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



చేతుల శుభ్రతపై వివరిస్తున్న విద్యార్థిని

కశింకోట: వెదురుపర్తి హైస్కూల్‌లో 'శుభ్రమైన పాత్ర–పరిశుభ్రమైన చేతులు' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎ.వి.ఎస్.మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయుడు పి.రమేష్ విద్యార్థులకు చేతుల శుభ్రత చేసుకునే విధానాన్ని వివరించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రం చేసుకుని భోజనం చేయాలన్నారు. విద్యార్థులతో చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, ఎ.నూకరాజు, వై.విజయ్, సత్యవాణి, సోమరాజు, త్రివేణి, సబితలక్ష్మి, పి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కశింకోట: మండలంలోని బయ్యవరం మేదవీధి రామాలయం వద్ద సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశాఖ కేర్ ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ గొల్లవిల్లి జయ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లవిల్లి నానాజీ, ఉప్పనూరి అప్పారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 9,630 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,030	5,160
మొదటి రకం	3,810	5.100
రెండో రకం	3,280	4,400
మూడోరకం	3,100	3,260

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	:	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	:	సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	:	పర్తిసాయి
మ్యాక్స్	:	షిర్డీసాయి
క్రేవిన్ ది హంటర్	:	వెంకటేశ్వర
సై	:	శ్రీసత్య
మార్కో	:	రామచంద్ర


రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 15 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–4 యూనిట్లు, ఓ పాజిటివ్–8 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 389 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 341 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924–223595 నంబరులో సంప్రదించవచ్చు.

కృష్ణావతారంలో వెంకన్న కనువిందు



శ్రీకృష్ణ అవతారంలో దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి చక్రవర్తి మాట్లాడుతూ మంగ, బుధ వారాలు కూడా వెంకన్న స్వామి శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారని చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

'గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇవ్వాలి'

అచ్యుతాపురం: స్థానిక సెజ్‌లో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ హైడ్రోజన్ ఎన్‌టీపీసీ పవర్ ప్లాంట్‌లో పూడిమడక వాసులకు ఉద్యోగాలు కల్పించాలని వైఎస్‌ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బోడపల్లి అప్పారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్లాంట్‌కు ఈ నెల 8న ప్రధాని వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారని, అదే సమయంలో ప్లాంట్ ఏర్పాటు కారణంగా నిర్వాసితులైన వారికి ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తారో వెల్లడించాలని కోరారు. 1200 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ ప్లాంట్‌కు సమకూర్చిన స్థలం రైతుల త్యాగాల వల్ల లభించిందని గుర్తించుకోవాలన్నారు. వాయు, జల కాలుష్యాలతో ఉపాధికి కోల్పోయిన మత్స్యకారులకు కూడా న్యాయం చేయాలన్నారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం



గ్రామ సభలో సమస్యను వివరిస్తున్న అప్పారావు

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం గ్రామ సభ జరిగింది. ప్రజలు తమ సమస్యలను సభలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, వీధి రోడ్ల అభివృద్ధి, రైతులకు కావలసిన విత్తనాలు సకాలంలో అందజేయాలని, గడ్డి విత్తనాలు సరఫరా చేయాలని, తుమ్మపాల వీధిలో పబ్లిక్ టాయిలెట్లకు అన్ని సదుపాయాలు కల్పించాలని, రాత్రి సమయంలో విద్యుత్ కోతలు విధించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు మాట్లాడుతూ దశలు వారీగా ప్రజల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మన గ్రామం రాష్ట్ర అవార్డుకు ఎంపికైందన్నారు. ప్రజల సహకారంతో రాష్ట్రంలో తుమ్మపాల పంచాయతీ మరిన్ని అవార్డులు తీసుకునేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు టి.సత్యారావు, మాదిబోయిన నాగరాజు, వై.రామారావు, కె.భాస్కరరావు, పీలా సీతారాం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కీమోథెరపీ సమయంలో ప్లేట్‌లెట్స్ అవసరం



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వియోల

అనకాపల్లి: క్యాన్సర్ బాధితులకు కీమోథెరపీ చేసే సమయంలో ప్లేట్‌లెట్స్ పడిపోతాయని, అటువంటి సమయంలో ప్లేట్‌లెట్స్ ఎంతో అవసరమని అగనంపూడి డాక్టర్ హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యురాలు టి.వియోల తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డు హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత రక్తదానం చేయడం ద్వారా రక్తంలో ప్లేట్‌లెట్స్‌ను సేకరించి, క్యాన్సర్ రోగులకు అత్యవసర సమయంలో అందజేస్తామన్నారు. రక్తదానం చేయడం వల్ల వ్యాధుల బారిన పడకుండా యువత ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీధర్, కెమికల్ హెచ్‌వోడీ కె.రామ్మోహనరావు, మెడికల్ సోషల్ వర్కర్ ఎస్.చంద్రరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎం.జి.రాజ్‌కుమార్, కె.మల్లికార్జునరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమావేశమైన కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ 1982-83 బ్యాచ్ విద్యార్థులు

కశింకోట: కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న 1982–83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సోమవారం జరిగింది. పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకుని కుటుంబ క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన రాఘవమూర్తి, పరశురాంలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వి.ప్రభాకరరావు, ఖాదర్, చిన్నారావు, శ్రీవాణి, వరలక్ష్మి, శంకరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ స్థానం



జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి అందుకున్న విద్యార్థితో పాఠశాల ఉపాధ్యాయులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రోబోటిక్ నమూనా

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారం పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్ తెలిపారు. గత శనివారం అనకాపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థి సీహెచ్.మణికంఠ తయారు చేసిన ఫ్లోర్ క్లీనర్ రోబోట్ యూజింగ్ స్మార్ట్‌ఫోన్ అనే నమూనాకు ద్వితీయ స్థానం దక్కింది. విజయవాడలో మంగళవారం జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఈ నమూనా ఎంపికైంది. ఈ మేరకు మణికంఠను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

జీసీజీటీఏ సంయుక్త కార్యదర్శిగా పైడిరాజు



పైడిరాజును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి తదితరులు

మాడుగుల: గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీజీటీఏ) జిల్లా సంయుక్త కార్యదర్శిగా స్థానిక డిగ్రీ కళాశాల, తెలుగు ఉపన్యాసికుడు పులపర్తి పైడిరాజు ఎంపికయ్యారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో సి.వి.ఎస్.ఎస్ శాస్త్రి, తోటి ఉపన్యాసికులు దుశ్శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరీక్షల నివేదిక తనిఖీ



పీఎల్ పురం పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పట్టిక పరిశీలిస్తున్న డాక్టర్ ప్రశాంతి

పాయకరావుపేట: మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య పరీక్షల నివేదిక తనిఖీ చేసినట్టు రాష్ట్రీయ బాల స్వస్థ ఎన్‌సీడీ ప్రోగ్రామింగ్ అధికారి ప్రశాంతి తెలిపారు. మండలంలోని పీఎల్ పురం పాఠశాలలో విద్యార్థులకు చేసిన ఆరోగ్య పరీక్షలు, రికార్డులను ఆమె సోమవారం పరిశీలించారు. గ్రామంలో అసంక్రమిత వ్యాధులకు చికిత్స నిర్ధారణపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సుభాష్, డాక్టర్ వి.సౌజన్య, ఈవో పి.వి.రమణ, ఎంపీహెచ్ఎస్ నాగేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పని ఒత్తిడిపై సచివాలయ ఉద్యోగుల వినతి



ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మునగపాక: పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు సోమవారం ఎంపీడీవో ఎం.ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. గతంలో వలంటీర్లు చేసే పనులను ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల ద్వారా జరుగుతున్నాయని, దీంతో పనిభారం పెరుగుతుందని పలువురు సచివాలయ ఉద్యోగులు తెలిపారు. మండల కేంద్రాల్లో అటెండెన్స్ వేసే సదుపాయం లేకపోవడంతో కిలోమీటర్ల మేర సుదూర ప్రయాణం చేసి అటెండెన్స్ వేయాల్సి వస్తుందన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ యూనియన్ మండల అధ్యక్షుడు అల్ల దేవకి, ఉపాధ్యక్షుడు కె.రమేష్, కార్యదర్శులు పవన్, ఆర్.అశోక్ జయదీప్, కోశాధికారి శ్రవణ్ పాల్గొన్నారు.

మోదకొండమ్మ చీరల వేలం

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మకు భక్తులు సమర్పించిన చీరల వేలం పాట సోమవారం స్థానిక దేవీ ఆలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ వేలంలో గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పోటీపడ్డారు. అమ్మవారి చీర లభిస్తే మంచి జరుగుతుందని నమ్మకంతో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు ఉపయోగపడేలా బోధన అవసరం



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో గిడ్డి అప్పారావునాయుడు

అనకాపల్లి: విద్యార్థుల భవితకు ఉపయోగపడేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు సూచించారు. మండలంలో కొప్పాక హైస్కూల్ ఆవరణలో ఏపీసీ సమగ్ర శిక్ష ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన సాగించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. అంతకు ముందు జిల్లాలో 20 మంది కేజీబీవీ హెచ్‌ఎంలకు, తెలుగు, గణితం, ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు, సమగ్ర శిక్షణ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ పి.హైమేశ్వరరావు, సమగ్ర శిక్షణ మండల ఉపాధ్యాయురాలు వి.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మార్మోగుతున్న హరినామ స్మరణ



నూతలగుంటపాలెం శివారు అచ్యుతాపురంలో పల్లకిలో శ్రీకృష్ణుని ఊరేగిస్తున్న భక్తులు



ఏఎస్ పేటలో ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభిస్తున్న మేలుకొలుపు



తేగాడలో పల్లకిలో శ్రీకృష్ణుని ఊరేగిస్తూ నిర్వహిస్తున్న మేలుకొలుపు కార్యక్రమం



కొత్తపల్లి వీధుల్లో నిర్వహిస్తున్న మేలుకొలుపు భజన కార్యక్రమం

కశింకోట: మండలంలోని పలు గ్రామాలు హరినామ స్మరణతో మార్మోగుతున్నాయి. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మేలుకొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మండలంలోని ఏఎస్ పేటలో ఆంజనేయస్వామి ఆలయం నుంచి మందపల్లి శివ ఆధ్వర్యంలో మేలు కొలుపు నిర్వహించారు. గొబ్బూరు, సోమవరం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, కన్నూరుపాలెం, తేగాడ, కొత్తపల్లి, నూతలగుంటపాలెం శివారు అచ్యుతాపురం, వెదురుపర్తి తదితర గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపడుతున్నారు. కశింకోటలోని గవరపేటలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా మంగళ ధ్వని, మహిళా భక్తులు మేలు కొలుపు భజన పాటలు పాడి స్వామిని నిద్రలేపారు.

ప్రభుత్వ తీరును నిరసిస్తూ నేడు ఆటో కార్మికుల సదస్సు



సదస్సు కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఆటో కార్మికులు

యలమంచిలి రూరల్: ఇప్పటికే ఎన్నో ఇబ్బందులతో పూట గడవడమే కష్టంగా ఉన్న ఆటో, మోటారు రంగంపై ఆధారపడి పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారమే అజెండాగా మంగళవారం యలమంచిలి పెంజెరువు కనకదుర్గమ్మ ఆలయం వద్ద సదస్సు నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గనిశెట్టి సుదాసు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆటో స్టాండు వద్ద సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆటో కార్మికులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది ఆటో, మోటారు కార్మికుల పొట్ట కొట్టేలా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఉంటున్నాయని విమర్శించారు. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమ జీవనోపాధిని దెబ్బ తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించనున్న యలమంచిలి డివిజన్ ఆటో, మోటారు కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షుడు అల్లిమళ్ల నాగు, వివిధ గ్రామాల ఆటో యూనియన్‌ల నాయకులు బాషా, విశ్వనాథం, నగిరెడ్డి శివ పాల్గొన్నారు.

తల్లికి వందనం అమలు చేయాలని ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

నర్సీపట్నం: తల్లికి వందనం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. కార్యాలయం ఏవో సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని వచ్చే ఏడాది నుంచి కాకుండా ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలన్నారు. విద్యార్థి సంఘ నాయకులు కిరణ్, హర్షిత, శృతిరాజు తదితరులు పాల్గొన్నారు.